ప్రజాశక్తి

శనివారం 29 ఏప్రిల్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

తిడుతూనే కడుతున్నారు..

- పన్ను ఏటా 10-15 శాతం పెరుగుదల
- బెంబేలెత్తుతున్న నగర ప్రజలు
- 5శాతం రాయితీతో ముందస్తు ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆస్తి విలువ ఆధారంగా పన్నులు నిర్ధారించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రభావం క్రమంగా ప్రజలకు అర్థం అవుతోంది. పెంపుదల భారం భారీగా కొనసాగుతోంది. పైసల్లో మాత్రమే పెంచుతున్నామని దీనికి ఇంత రాద్ధాంతం అవసరమా అని ఆస్తి పన్ను పెంపు సందర్భంగా మంత్రులు, ప్రభుత్వ పెద్దలు వ్యాఖ్యలు చేశారు. నూతన విధానం కేవలం ఒక్క ఏడాది మాత్రమేనని 2021లో పన్నుల పెంపుపై ప్రతిపక్షాలు ఆందోళన చేసిన సమయంలో అప్పటి మున్సిపల్ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కానీ ఆచరణలో మాత్రం ఏటా 10-15 శాతం పెంచుతున్నారని తెలిసి ప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిట్టుకుంటూనే పన్నులు చెల్లిస్తున్నారు.

2021 మార్చి ముందు అద్దె ఆధారంగా పన్ను ఆస్తి పన్ను నిర్ధారించే వారు. వైసిపి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 2021-22 నుంచి ఆస్తి విలువ ఆధారంగా పన్ను వసూలు చేయాలని నిర్ణయించింది. తొలుత కేవలం 0.15 శాతం మాత్రమే పన్నులు పెంచుతున్నామని అధికారులు నగర పాలక సంస్థ సమావేశంలో వెల్లడించారు. కానీ గత మూడేళ్లలో 10-15 శాతం పెంపుదలతో డిమాండ్ నోటీసులు వస్తుండటంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిఏటా ఈ పెంపుదల ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ ఆస్తులు మినహాయించి 2021-22లో గుంటూరు నగర పాలక సంస్థకు రూ.93 కోట్ల డిమాండ్ ఉండగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.99 కోట్ల పెరిగింది. 2022-23 సంవత్సరంలో రూ.106 కోట్లకు పెరిగింది. 2023-24లో రూ.115 కోట్లకు చేరింది. పాత బకాయిలు కలిపి 2023-24లో పన్నుల ద్వారా వచ్చే ఆదాయం రూ.138 కోట్లకు పెరిగింది. 2023 మార్చి నాటికి బకాయిలు చెల్లిస్తే వడ్డీ రద్దు చేస్తామని ప్రకటించడంతో రూ.118 కోట్లు వసూలయ్యాయి. వడ్డీ రాయితీ మినహాయింపుతో చాలా

▶ 2లో





కమ్యూనిస్టుల గొంతులో ఊపిరున్నంత వరకూ
బిజెపి మతోన్మాద విధానాలను సాగనివ్వం

- సిపిఎం నేత పి.మధు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు
- ప్రజలపై అన్ని రకాలుగా దాడులు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం
- సిపిఎం, సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శులు గుంటూరు విజయ్‌కుమార్, మారుతి వరప్రసాద్
- సత్తెనపల్లిలో ప్రచారభేరీ బహిరంగ సభ, భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కమ్యూనిస్టుల గొంతులో ఊపిరున్నంత వరకూ బిజెపి మతోన్మాద విధానాలను సాగనివ్వబోమని సిపిఎం నేత పి.మధు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరిలో భాగంగా పట్టణంలోని జిల్లా గ్రంథాలయం వద్ద శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షత వహించగా ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రజలపై అన్ని రకాలుగా దాడులు చేస్తోందని, ధరల భారం మోపుతోందని అన్నారు. రాష్ట్రానికి దక్కాల్సిన నిధులనూ ఇవ్వకపోగా విశాఖ ఉక్కును

▶ 2లో

టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసివ్వాలి



టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని టిడ్కో ఇల్లను సిపిఎం నాయకులతో కలిసి మధు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణం ప్రారంభించి ఐదేళ్లయినా నేటికీ పూర్తి చేయలేదన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్, తహశీల్దార్ కార్యాలయ భవనాలను పరిశీలించారు. నూతన భవనాలను 15 రోజుల్లో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేకుంటే తామే ప్రారంభిస్తామని చెప్పారు. పరిశీలనలో గుంటూరు విజయకుమార్, గద్దె చలమయ్య, డి.విమల, పి.మహేష్, ఎన్.వేణుగోపాల్, ఇర్మియా పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగుతున్న నాటికలు

నేడు ముగింపు

3లో



రైతేరాజు నాటికలో సన్నివేశం

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-నరసరావుపేట

నిధుల దుర్వినియోగం అంశంలో ఒ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని గామాలపాడు పంచాయితీ కార్యదర్శిగా పని చేసిన పి.విజయ్‌కుమార్ రూ.25.22 లక్షలను దుర్వినియోగం చేశారు. దీనిపై విచారణ చేస్తూ ఆయన్ను విధుల నుండి తప్పించి మరో కార్యదర్శిని నియమించారు. అయితే ప్రస్తుత కార్యదర్శికి రికార్డులనూ విజయ్‌కుమార్ అప్పగించని కారణంగా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

సమావేశాలంటే చిన్నచూపు తగదు

- స్టాండింగ్ కమిటీ సమావేశాలకు అధికారుల గైర్హాజరుపై జెడ్పీచైర్‌పర్సన్ హెనీక్రిస్టినా అసంతృప్తి
- స్థానిక సంస్థలంటే గౌరవం లేదా..? : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంస్థలు, జెడ్పీ సమావేశాల పట్ల అధికారుల వైఖరి బాధాకరమని జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. శుక్రవారం జెడ్పీ స్థాయి సమావేశాలు జెడ్పీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ స్థాయి సంఘ సమావేశంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ సమావేశాలు నిర్వహిస్తున్నప్పుడు అధికారులందరికీ ముందుగానే సమాచారం ఇస్తున్నామని, కానీ ప్రతిసారీ ఏదోఒక కారణం చెప్పి హాజరు కావట్లేదని అన్నారు. సమావేశంలో తొలుత ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చర్చను ప్రారంభిస్తూ విద్య, వైద్యంపై చర్చ జరగాల్సిన

▶ 2లో



జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను అభినందిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, జెడ్‌పిటిసిలు, అధికారులు

ఛైర్‌పర్సన్‌కు ఎమ్మెల్సీ కెఎస్ అభినందన

జెడ్పీ హైస్కూల్స్‌కు నైట్ వాచ్‌మెన్ల నియామక ఉత్తర్వులు రావటంలో ముఖ్యపాత్ర పోషించిన జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అభినందించారు. స్థాయి సంఘ

▶ 2లో

కార్మిక దినోత్సవం మేడే కరపత్రాల పంపిణీ



ప్రజాశక్తి- మేడికొండూరు

పేరేచర్ల సెంటర్లో మేడే కార్మికుల హక్కులు సాధించే దినోత్సవం గా జరపాలని సిఐటియు మండల అధ్యక్షుడు ఎస్.కె భాష కరపత్రమును శుక్రవారం విడుదల చేశారు .కౌలు రైతు సంఘ నాయకులు బొట్ల రామ కృష్ణ మాట్లాడుతూ రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధించాలని, నాలుగు లెబరు కోడ్ లను రద్దు చేయాలని, సమ సమాజం నిర్మించాలని ఆరోజు అందరూ కలిసి ఐక్యతతో ప్రతిజ్ఞ చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమమునకు పంచాయతీ వర్కర్స్ అధ్యక్షుడు జె శంకర్రావు, ఎస్ కె రిజ్వాన, మరియదాసు, డి జోసఫ్, డి బుజ్జి ,కాజాబి, చార్లెస్, ప్రసాదమ్మ పాల్గొన్నారు.

తిడుతూనే కడుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

మంది బకాయిలు మొత్తం చెల్లించేశారు. తాజాగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 30 తేదీలోపు ఈ సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వస్తుందని ప్రకటించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రస్తుత ఏడాది పన్ను చెల్లింపునకు వచ్చే మార్చి వరకు గడువున్నా ఐదు శాతం రాయితీ ఇవ్వడం వల్ల గుడ్డి కన్నా మెల్ల మేలు అన్నట్టుగా 15 శాతం పెంపులో ఐదు శాతం తగ్గినా తగినట్టేనని కొంత మంది ముందుకు వస్తున్నారు. ముందస్తు చెల్లింపుదారుల్ల ధనికులు, ఎగువ మధ్య తరగతి వారు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ ముందస్తు వసూలు లక్ష్యం రూ.50 కోట్లు కాగా గత 28 రోజుల్లో రూ.42 కోట్ల వరకూ వసూలు చేయగలిగారు. చివరి రెండ్రోజుల్లో మరో రూ.3 కోట్ల వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు.

సమావేశాలంటే చిన్నచూపు తగదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ స్థాయి సంఘ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు హాజరు కాకపోవటం సరికాదన్నారు. జిల్లా అధికారులు హాజరు కాకపోతే సభ్యులు సమస్యలపై ఎవరితో చర్చించాలని ప్రశ్నించారు. అధికారుల వైఖరిపై తీవ్ర నిరసన తెలియజేస్తున్నానని అన్నారు. అధికారులకు స్థానిక సంస్థల పట్ల అధికారులకు గౌరవం లేదా అని ప్రశ్నించారు. కర్లపాలెం, బాపట్ల మండలాల్లో ఐదు ఎయిడెడ్ స్కూల్స్ మూతపడ్డాయని, వాటికి ప్రత్యామ్నాంగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కెఎస్ లక్ష్మణరావు కోరారు. అనేక దశాబ్ధాలుగా జెడ్పీ హైస్కూల్స్ లేని మండల కేంద్రాలైన రెంటచింతల, భట్టిప్రోలు, ఫిరంగిపురం, అమరావతి తదితర మండల కేంద్రాల్లో జెడ్పీ హైస్కూల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతేడాది ప్రారంభించిన ప్లస్-2 స్కూల్స్‌లో వచ్చే విద్యా సంవత్సరానికైనా సరిపడా అధ్యాపకులు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. పొన్నూరు జెడ్‌పిటిసి మాటాడుతూ జెడ్పీ హైస్కూల్స్‌లో నైట్ వాచ్‌మెన్ల నియామకంలో ఇప్పటికే పనిచేస్తున్న వారికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. రేషన్ కార్డుల్లో పేర్లు మార్పులకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయని విషయాన్ని మాచవరం జెడ్‌పిటిసి, ఇతర సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు.

చైర్‌పర్సన్‌కు ఎమ్మెల్సీ కెఎస్ అభినందన

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాల సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు క్రిస్టినాను శాలువా, పూలబొకేతో సన్మానించారు. అనేక సంవత్సరాలుగా పాఠశాలల్లో విలువైన వస్తువుల పరిరక్షణ, అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి నైట్ వాచ్‌మెన్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సిఎం ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కృషి చేయటం అభినందనీయమన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో 5600 పాఠశాలల్లో, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 350 హైస్కూల్స్‌లో వాచ్‌మెన్ల నియామకం జరుగుతుందన్నారు.

జిజిహెచ్‌లో బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

యడ్లపాడు మండలం జాలాది గ్రామానికి చెందిన 10 ఏళ్ల బాలుడి కడుపులో ఉన్న కిలోన్నర కణితిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు శుక్రవారం తొలగించారు. జాలాది గ్రామానికి చెందిన గోగులమూడి నాగార్జున, లావణ్య దంపతుల పది నెలల కొడుకు రియాన్స్ కు వాంతులు, విరోచనాలు, జ్వరం తో బాధ పడుతున్నాడు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ సమస్య తో బాధపడుతున్నాడు. తమ అబ్బాయిని బ్రతికించుకోవడానికి ప్రైవేట్ ఆసుపత్రులు చుట్టూ తిరిగారు. చూపించారు. ఎక్కడకు వెళ్లిన లాభం లేదని చెప్పడం తో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. చివరి ప్రయత్నం గా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల వార్డు కు ఈ నెల ఆరో తేదీన తీసుకుని వచ్చారు. రెండురోజుల పాటు చిన్నారి కి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఎనిమిదో తేదిన పీడియాట్రిక్ సర్జరీ వార్డు కి బదిలీ చేశారు.

చిన్నారి కి రక్తం ఎక్కించి రక్తహీనత సరి చేశారు.. అదేవిధంగా రక్త పరీక్షలు, ఆల్ట్రో సౌండ్ ,సిటీ స్కాను, ఎంఆర్ఐ స్కాన్ పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో వైద్యులు ఉదరకోశ రాక్షస కణితి(గాస్ట్రిక్ టెరటోమా) గా నిర్ధారించారు. పొట్టలో కణితి 20 సెంటీమీటర్లు పొడవు 18 సెంటీమీటర్ల వెడల్పు 15 సెంటీమీటర్ల లోతు ఉన్నట్లు గుర్తించారు. పొట్టకు కణితి చాలావరకు అంతా ఆక్రమించినది. పొట్టలో ఉదరకోశ రాక్షస కణితి ఉండటం చాలా అరుదుగా కనిపిస్తోంది. ఇలాంటి కేసులు ఇప్పటివరకు ప్రపంచం లో మీద 112 కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఈ సందర్భంగా పిడియాట్రిక్ విభాగం అధిపతి

డాక్టర్ చందా భాస్కర రావు మాట్లాడుతూ 29 సంవత్సరాల పిల్లల ఆపరేషన్ అనుభవంలో ఈ రకమైన కణితి ఉన్న పిల్లలను చూడడం ఇదే తొలిసారన్నారు.ఈ నెల 15 వ తేదీన చిన్నారికి సర్జికల్ టీము ఐదున్నర గంటలు శ్రమించి సక్సెస్ ఫుల్ గా పూర్తి గా కణితిని తొలగించాం. ఈ కణితి జీర్ణకోశము వెనుక గోడ నుండి వచ్చింది. జీర్ణాశయము లోకి కూడా పాకి ఉంది. క్లోమగ్రంధికి ,పెద్ద పేగు కి, బల్లకి (స్ప్లీన్), పేగులకి రక్తప్రసరణ ఇచ్చే ప్రధాన ధమనులకు అంటుకొని ఉంది. . వీనాకేవా, పెద్ద సిరా కి కూడా అంటుకొని ఉండటం తో వాటి నుండి రిలీజ్ చేసి జీర్ణాశయ వెనుక గోడను తొలగించడం జరిగింది(Partial gastrectomy). తర్వాత జీర్ణాశయమును రీ కన్స్ట్రక్షన్ చేయడం జరిగింది. వాచిన లింఫ్ గ్రంధులు నాలుగు గ్రూపుల నుండి లావుగానున్న లింపు నోడ్స్ ను తీసామన్నారు. మాకు అందిన రిపోర్ట్ ప్రకారం కణితిలో చర్మం యొక్క కణాలు ,పన్ను(టూత్), మదులాస్థి(కార్టిలేజ్), కండరములు, నరాల కడజాలములు అస్తవ్యస్తంగా ,ఒక పద్ధతి లేకుండా ఉన్నాయి.మూలకణజాలము(స్టెమ్ సెల్) నుండి వచ్చే మూడు పొరలు నుండి వచ్చే కణాలు ఈ కణితిలో ఉన్నవి . మెచ్యూర్డ్ గ్యాస్ట్రిక్ టెరటోమా లేదా పరిణిత చెందిన ఉదరకోశ రాకాసి కణితి గా నిర్ధారించబడినది. నాలుగు గ్రూపులు నుండి తీసిన లింఫ్ గ్రంధులు, లింఫ్ నోడ్ రిపోర్టులో క్యాన్సర్ కడజాలము లేనట్లుగా వచ్చినదన్నారు. కణితి నీ పూర్తిగా తొలగించామన్నారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ వైద్యులు అద్భుతంగా శస్త్ర చికిత్స చేసి కణితి తొలగించడం అభినందనీయమన్నారు.

ఇప్పుడు ఆ చిన్నారి ఆరోగ్యకర ముగా ఉన్నాడని ఆమె అన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్చ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఆపరేషన్ బందం లో డాక్టర్ జయపాల్ డాక్టర్ సుమన్ , డాక్టర్ మౌనిక డాక్టర్ భావిష్, డాక్టర్ పరశురాం, ఎనస్తీసియా లో డాక్టర్ నాగభూషణం డాక్టర్ వహీదా సహకారం అందించారు.

మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా లెనిన్



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం స్థానిక కోర్టు పరిధిలో జరిగాయి. మొత్తం 134 ఓట్లు గాను, 124 ఓట్లు పోలైనాయి. అధ్యక్ష పదవికి వాకా రామ్ గోపాల్ గౌడ్, జొన్నాదుల లెనిన్ పోటీపడ్డారు. మూడు ఓట్ల మెజార్టీతో జొన్నాధుల లెనిన్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా బేతపూడి నాయుడమ్మ ఎం సురేంద్ర బాబుపై 23 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఎస్ బాలశౌరి, టీ నరసింహారావు లకు సమాన ఓట్లు లభించాయి. టాస్ వేగా తొలి ఆరు నెలలు ఎస్ బాలశౌరి, ఆ తర్వాత ఆరు నెలలు టీ నరసింహారావు పనిచేస్తారు. కోశాధికారిగా ఎస్ మురళీకష్ణ ఎన్నికయ్యారు. మహిళ కార్యదర్శిగా పోటీ చేసిన ఇద్దరికీ కే స్వరూప రాణి, ఇందిరా ప్రియ దర్శినులకు సమానంగా ఓట్లు వచ్చాయి. తొలి ఆరు నెలలు స్వరూప రాణి, ఆ తర్వాత ఆరు నెలలు ఇందిరా ప్రియదర్శిని పనిచేస్తారు. సహాయ కార్యదర్శిగా ఆర్ రాజేష్, లైబ్రరీ కార్యదర్శిగా పి సురేష్ ఎన్నికయ్యారు. పదిమంది ఈసీ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉత్తమ గ్రామ పంచాయితీల కార్యదర్శిలకు సన్మానం

ప్రజాశక్తి-నరసరావుపేట

జొన్నలగడ్డ పంచాయతీ కార్యదర్శి రామసీత ను శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యలయంలో తోటి పంచాయితీ కార్యదర్శి లు ఘనంగా సన్మానించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా 9 టీములలో వుత్తమ ప్రతిభ కనబరిచిన జొన్నలగడ్డ, రెడ్డిపాలెం, కె.ఎం అగ్రహారం గ్రామాలకు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డు రావడానికి ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శిలు కృషి చేశారని ఈవోఆర్‌డి విజయ కుమార్ తెలిపారు. గ్రామాలు అభివద్ధి చెందాలంటే నాయకులతో పాటు గ్రామస్తుల సహకారం కూడా ఉండాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రామసీత ను శాలువాలతో సత్కరించారు.

బిజెపి మతోన్మాద విధానాలను సాగనివ్వం





మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, గుంటూరు విజయకుమార్

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముతానంటుంటే రాష్ట్రంలోని అధికార ప్రతిపక్షాలు దీనిపై ప్రశ్నించకుండా వారికి వారు పరస్పర ఆరోపణలతో సరిపెట్టుకుంటున్నాయని విమర్శించారు. మంత్రి అంబటి రాంబాబు సెల్‌ఫోన్లకు, ఇళ్లకు స్టికర్లు అంటించుకుంటూ రైతుల సమస్యలను మాత్రం విస్మరించారని దుయ్యబట్టారు. రైతులు, రైతుసంఘాల పోరాట ఫలితంగానే సాగునీరు విడుదల చేయడం వల్ల దిగుబడులు పెరిగాయని చెప్పారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పేరెన్నికగన్న ఫణిదం చేనేత సహకార సంఘం పాలకుల విధానాలతో కుంటుపడిందని, శాతవాహన స్పిన్నింగ్ మిల్లు మూతతో వందలాది కార్మికులు రోడ్డున పడ్డారని గుర్తు చేశారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, పుతుంబాక వెంకటపతి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే మోడీ కేసులు పెడతారనే భయంతో రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా పదేళ్లు కావాలన్న బిజెపి నాయకులు ఇప్పుడేమయ్యారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుంతో చెప్పలేని పరిస్థితలో నీటి పారుదల శాఖ మంత్రి ఉన్నారని ఎద్దేవ చేశారు. డి.విమల మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, నల్లధనం వెలికితీత, తదితర హామీలతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ వాటికి తిలోదకాలిచ్చారని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ దేశ సంపదను అందాని, అంబానీలకు కట్టబెడుతున్న, ప్రజల, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోడీని గద్దెదింపి దేశాన్ని కాపాడేందుకు కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలని కోరారు. సభలో సిపిఎం, సిపిఐ నాయకులు గద్దె చలమయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్, జి.రవిబాబు, ఎం.పిచ్చిరెడ్డి, జి.పిచ్చారావు, జి.బాలకృష్ణ, కె.రాంబాబు, ఎన్.వేణుగోపాల్, ఇర్మియా పాల్గొన్నారు.

డప్పుల జోరు.. నినాదాల హోరు..

బహిరంగ సభ సందర్భ:గా సిపిఎం, సిపిఐ శ్రేణులు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించాయి. పాత బస్టాండ్ వద్ద ఉన్న పుతుంబాక భవన్ నుండి ప్రారంభమైన ప్రదర్శన లక్కరాజుగార్లపాడు సెంటర్, గడియారపు స్తంభం మీదుగా జిల్లా గ్రంథాలయం వద్ద బహిరంగ సభ వేదిక వరకూ సాగింది. మహిళా కళాకారుల డప్పుల వాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు, కళాకారులు నాగమ్మ, తులసి, అమూల్య, ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి గనీ, కళాకారులు వల్లెం చెన్నకేశవులు, డప్పు కళాకారులు అనూషా, తాతారావు, అనిల్, రవి, సుధాకర్, సుజాత పాల్గొన్నారు.







సందేశాత్మకంగా సాగుతున్న నాటికలు

మూడో రోజుకు చేరిన వైఎస్సార్ కళాపరిషత్ నాటకోత్సవాలు - నేడు ముగింపు సభ

ప్రజాశక్తి-తెనాలి:
ఈనెల 26 నుంచి ప్రారంభమైన వైఎస్సార్ నాటక కళాపరిషత్ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం నాటిక మూడో రోజుకు చేరాయి. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్య చిల్డ్రన్స్ ఆర్ట్స్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నాటికలకు ముందు జరిగిన సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. పోటీల్లో నాటిక ప్రదర్శనలు అత్యంత సదేశాత్మకంగా సాగుతున్నాయి. నటీనటుల ఆహార్యం, అభినయం ఆద్యంతం ప్రేక్షకుల జేజేలందుకుంటున్నాయి. తొలి ప్రదర్శనగా గుంటూరు అమృత లహరి ఆర్ట్స్ వారి నాన్నా నే వచ్చేస్తా నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు కాగా దర్శకత్వ బాధ్యతలను అమృత లహరి నిర్వహించారు. నాటిక సారాంశాన్ని పరిశీలిస్తే బాల్యం నుంచి వివాహం వరకూ పిల్లలను తల్లిదండ్రులు ఎంతో గారాభంగా పెంచుతున్నారు. ఈ గారాభం చిన్న చిన్న సమ్యలను కూడా ఎదుర్కోలేని పరిస్థితికి దారితీస్తోంది. చివరకు భార్యా భర్తల మధ్య వచ్చే చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించుకోలేక 'నాన్నా నేనొచ్చేస్తా' అంటూ కుమార్తె ఫోన్ చేయటం కథాంశంగా నాటిక సాగుతుంది. నాన్నా నేనొచ్చేస్తా నుంచి నాన్నా మాయింటి రండనే రోజులు రావాలంటూ సందేశాత్మకంగా నాటిక సాగింది.


నాన్నా నే వచ్చేస్తా నాటికలో సన్నివేశం

రెండో ప్రదర్శనగా 'రైతేరాజు'

రెండో ప్రదర్శనగా రైతేరాజు నాటికను హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారు ప్రదర్శించారు. కంచర్ల రాజశేఖర్ రచనకు, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. నాటిక కథాంశాన్ని పరిశీలిస్తే నాటిక వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొనే సమస్యలకు అద్దం పట్టింది. కల్తీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు, దళారులు అందరూ రైతుల పాలిట శాపంగానే ఉన్నారు. దీనికితోడు ప్రకృతి వైపరీత్యాలు. వీటన్నింటిని అధికమించి ఎలాగోకలా పంట పండిస్తే, అ పంటకు ధర నిర్ణయించుకునే హక్కు రైతులకు లేదు. ఈ పరిణామాల మధ్య రైతులు ఎవరికి వారు వారికి అవసరమైన మేరకే పంట పండించు కునే దోరణిలోకి వస్తే ప్రజల పరిస్థితి ఏమిటన్నది కధాం శంగా నాటిక సాగింది. ప్రేక్షకుల హర్షధ్వానాలను అందుకుంది.

మూడో ప్రదర్శనగా 'ప్రక్షాళన'

నాటిక పోటీల్లో మూడో ప్రదర్శనగా ప్రక్షాళన నాటికను కాట్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ వారు ప్రదర్శించారు. నాటిక ఇతివృత్తాన్ని పరిశీలిస్తే రోజు రోపజుకూ పెరుగుతున్న సాంకేతి పరిజ్ఞానంతో లాభమెంత? నష్టం ఎంత? అని ప్రతిఒక్కరూ ప్రశ్నించుకోవాల్సిన సమయం, ప్రతి నిత్యం ఏదో ఓ మూల ఆడవారిపై అత్యాచారాలు, హత్యలు వంటి ఘాతుకాలకు హద్దు లేకుండా పోతుంది. సెల్‌ఫోన్లు, సాంకేతిక పరిజ్ఞానంతో పెడదారి పట్టి ఆడవారి జీవితాలతో ఆడుకుంటున్న కలుపు మొక్కల్ని ఏరిపారేయాలన్న సందేశంతో సాగింది.

నేడు ముగింపు సభ

నాటిక పోటీలు శనివారంతో ముగియనున్నాయి. ముగింపు సభకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు డాక్టర్ మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరు కానున్నారు. చివరి రోజున 'ఇతిహాసం' సాంఘిక నాటికతో నాటిక పోటీలు ముగుస్తాయి. ముఖ్యఅతిధుల చేతుల మీదుగా నాటిక పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు ఎం.సత్యనారాయణశెట్టి, ఆరాధ్యుత ఖన్నా తెలిపారు.

స్థల ఆక్రమణ వివాదంలో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మాచర్ల
స్థానిక 7వ వార్డులో సాయిబాబ స్కూల్ సమీపంలోని తన స్థలాన్ని ఆ ప్రాంతానికి చెందిన ఒక ఛోట నాయకుడు ఆక్రమిస్తుండటంతో మేకపోతుల లక్ష్మీ అనే మహిళ అక్కడే పెట్రోల్ పోసుకోని ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. ఆమెకు మద్దతుగా వచ్చిన మహిళ ఆ ప్రయత్నాన్ని వారించి అక్కడ నుండి ప్రక్కకు తీసుకొచ్చింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అటుగా వచ్చినా, పోలీసులు జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకోకపోగా మహిళలపై ఆగ్రహం వ్యక్తం చేయటంతో, సెంటర్‌కు వచ్చిన మహిళలు పోలీసుస్టేషన్ సమీపంలో సహాయంగా వచ్చిన మహిళ గంజెర్ల లక్ష్మీ ప్రధాన రహదారిపై పెట్రోల్ పోసుకోని ఆత్మహత్యయత్నంకు పాల్పడింది. మేకపోతుల లక్ష్మీకి చెందిన స్థలంపై చాల కాలంగా వివాదం జరుగుతుంది. అదే ప్రాంతానికి చెందిన నాయకుడు రవి లక్ష్మీ స్థలాన్ని ఆక్రమించారని, ఈ విషయాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి లక్ష్మీ తీసుకెళ్ళటం జరిగింది. గురువారం కూడ ఈ విషయంపై పట్టణ పోలీసుస్టేషన్‌లో పంచాయతీ జరిగినట్లు లక్ష్మీ తెలిసింది. తమ సమస్య పరిష్కారం కానందున చేసేది ఏమి లేక ఆత్మహత్యయత్నంకు పాల్పడినట్లు తెలిపారు. మేకపోతుల లక్ష్మీ, గంజెర్ల లక్ష్మీలకు ప్రభుత్వ వైద్యశాలలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల :మాచర్ల మండలం, కంభంపాడులో ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నల్గురికి తీవ్రగాయాలు అయినాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య జరుగుతున్న స్వల్ప ఘర్షణలు పెరిగి పెద్దవి అయి దాడులు చేసుకోనే వరకు వెళ్ళాయి. శనివారం జరిగిన దాడిలో వైసిపి పార్టీకి చెందిన చిట్టి నాగిరెడ్డి మరో ముగ్గురికి గాయాలైనాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కంభంపాడులో పోలీసు పెకెటింగ్‌ను ఏర్పాటు చేశారు.

ఇంటి తాళాలు పగులగొట్టి భారీచోరీ

ప్రజాశక్తి-నకరికల్లు
ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని బంగారం, వెండి,నగలను దొంగలు దోచుకుపోయిన సంఘటన నకరికల్లు లోని జానకిరామ్ రైస్ మిల్లు వెనుక బజారులో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మారెళ్ళ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 20వ తేదీన విజయవాడలో ఉన్న తన కూతురు దగ్గరికి వెళ్ళాడు. 27వ తారీకు సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండడంతో, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగలగొట్టి సామాన్లు చిందర వందర చేసి అందులో ఉన్న 6 సవర్ల బంగారు నగలు, అరకిలోవెండి, రూ.10వేల నగదు పోయినట్లు బాధితుడు తెలిపారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పల్నాడు జిల్లా క్లూస్ టీం సిబ్బంది వచ్చి వేలిముద్రలు సేకరించారు. గతంలో ఇదే తరహా దొంగతనం బ్యాంకు బజార్లో చోటు చేసుకుంది.


ఎస్.వీణామాధురి


కె.సుగుణ రావు


డి.కోటేశ్వరి




పి.సావిత్రి, ఎం.మమత, బి.వాసంతి

ఇంటర్ ఒకేషనల్ ఫలితాల్లో సెయింట్ పాల్స్ జయకేతనం

ప్రజాశక్తి-తెనాలి
ఇంటర్ వృత్తి విద్యా కోర్సుల ఫలితాలలో స్థానిక నాజర్ పేట లోని సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంఏ లింకన్ బాబు శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం ద్వితీయ సంవత్సరం డైరీయింగ్ కోర్సులో కె .సుగుణ రావు 1000 మార్కులకు 848, ఎంఎల్టి కోర్సులో ఎన్ వీణ మాధురి 861, నర్సింగ్ కోర్సులో డి కోటేశ్వరి 830 మార్కులు సాధించారు . అలాగే మొదటి సంవత్సరం డైరీయింగ్ కోర్సులో 500 మార్కులకు ఎం మమత 440, ఎంఎల్టి కోర్సులో బి.వాసంతి 389, నర్సింగ్ కోర్స్ లో పి సావిత్రి 445 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ లింకన్ బాబుతో పాటు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్షీలా సుజని, వత్తి విద్య కోర్సుల అకడమిక్ డైరెక్టర్ ఎం.కీర్తి అబ్రహాం అభినందించారు.

మణిపాల్ అవుట్ పేషెంట్ సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి-తాడేపల్లి :మణిపాల్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ సేవలు వినియోగించుకోవాలని, సాయంత్రం పూట కూడా రోగులకు సేవలను మరింత విస్తృత పరిచినట్లు డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. కీళ్లు, కండరాలు (రుమటాలజీ) సేవలు కూడా ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు. సాయంత్రం పూట అవుట్ పేషెంట్ విభాగాన్ని శుక్రవారం కన్సల్‌టెంట్ రుమటాలజిస్ట్ డాక్టర్ వివి దీపికా పొన్నూరు ప్రారంభించారు. ఈ విభాగంలో రుమటాయిడ్ అర్థరైటిస్, ఎస్ఎల్ఇ, స్క్రిర్లోడెర్మా, వాస్క్యులైటిస్, మరోసైటిస్, యాంటిఫాస్ఫోలిపిడ్ సిండ్రోమ్, ఆస్టియోపోరోసిస్, జువైనెల్ ఆర్థరైటిస్, ఫైబ్రోమైయాల్జియా సేవలు అందించనున్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్య నిర్వహణకు ప్రసిద్ధి గాంచిన స్పెషలిస్టులు, వైద్యులతో అత్యవసర సంరక్షణ, శిక్షణ పొందిన పారా మెడిక్స్‌తో పాటు అన్ని రకాల అత్యవసర పరిస్థితుల కోసం 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రుమటాలజీ చికిత్స ప్రారంభించడంతో ఈ ప్రాంతంలోని ప్రజలు అన్ని రకాల వైద్య సౌకర్యాలు మణిపాల్‌లో పొందవచ్చని సూచించారు. వీటితో పాటు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పల్మనాలజీ, ఇఎన్‌టి, పిడియాట్రిక్స, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటాలజీ, అంకాలజీ సేవలు ఇప్పుడు ఒపిడి కింద అందజేయబడుతున్నాయని చెప్పారు. రేడియాలజీ, ల్యాబరేటరీ, ఫార్మసీ సౌకర్యం అందుబాటులో ఉందని చెప్పారు. ప్రజలకు అధునాతన వైద్య పరికరాలను అందించడానికి సిద్ధంగా ఉన్న మణిపాల్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు, అపాయింట్‌మెంట్ కోసం, 08645 669966, 18001025555 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-తెనాలి
పట్టణానికి చెందిన హ్యాపి హాస్పిటల్, రెడ్ క్రాస్ సంస్థ సయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని ఇంర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహంచి, ఆరోగ్య సూచనలు చేశారు. ఎల్వి ప్రసాద్ కంటి వైద్యశాల సహకారంతో కంటి పరీక్షలు, దంత వైద్య నిపుణులు డాక్టర్ కె.వెంకటరాఘవేంద్ర సహకారంతో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాపి హాస్పిటల్ అధినేత డాక్టర్ వి.పవని ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అధ్యయనం చేసేందుకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. మెడికల్ రిపోర్టులు పాఠశాల యాజమాన్యం ద్వారా తల్లిదండ్రులకు అందజేస్తామన్నారు కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఏడుకొండలు రెడ్డి, డాక్టర్ గణేష్‌రెడ్డి, రంగారెడ్డి, ప్రిన్సిపల్ నర్గీస్, డాక్టర్ అరుణ్‌తేజ, డాక్టర్ ధనుంజయ్, పిఆర్వో సురేంద్ర, రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎం.భాఉమతి, నాళం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పవని ప్రియాంక

రాష్ట్రంలో భారతి రాజ్యాంగం అమలవుతోంది : పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆంధ్రప్రదేశ్‌లో భారత రాజ్యాంగం కాకుండా భారతి రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. స్థానిక పండరిపురంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్యలో పాత్రదారులు, సూత్రదారులు ఎవరో ప్రజలకు అర్థమైందని, ఎంపి అవినాష్‌రెడ్డిని కాపాడేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నారు. సిబిఐ, న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా సిఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేకపోగా ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చంద్రబాబు నాయుడు సభలకు జనం రాలేదంటూ మంత్రులు అంటున్నారని, వారి కళ్లను ఒకసారి పరీక్ష చేయించుకోవాలని ఎద్దేవ చేశారు. చంద్రబాబు సభలకు స్పందనపై ఇంటెలిజెన్స్, ఐ ప్యాక్ టీంతో విచారణ చేయించుకోవాలని అన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన అధికార పార్టీ వారు ఆ బాధ్యతను మరచి చంద్రబాబు, టిడిపి బజన ఎందుకని ఎద్దేవ చేశారు. వైసిపి నాయకులు ఏం చెప్పిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.



రేపు తెలుగు సినిమా పాటల పోటీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చైతన్య కళా స్రవంతి వార్షికోత్సవ సందర్భంగా జాతీయ తెలుగు సినిమా పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి చైతన్య కళా స్రవంతి అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు పాటల పోటీలు ట్రాక్ ఆధారంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.వెయ్యి, జ్ఞాపికలు, ప్రత్యేక బహుమతులుగా రూ.500 చొప్పున 10 మందికి అందిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు అమర్‌నాథ్, ఫోన్ : 9390132978కు సంప్రదించాలని సూచించారు.



సిఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల : వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు రూ.1,650 కోట్ల కేటయింపునకు బడ్జెట్‌లో ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నర్సరావుపేట ఎంపి శ్రీక్రిష్ణదేవరాయులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి కృతజ్ఞథలు తెలిపారు. ఈ మేరకు సిఎంను శుక్రవారం సిఎం క్యాంప్ కార్యాలయంలో కలిశారు.

నేడు మాచర్ల కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - మాచర్ల : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11.30కు కౌన్సిల్‌లో నిర్వహిస్తామని చైర్మన్ బోయ రఘురామిరెడ్డి శుక్రవారం తెలిపారు. తాగునీటి సరఫరా, ఇంజినీరింగ్ పనులు తదితర అత్యవసరమైన అంశాలపై చర్చించాల్సి ఉందని, కౌన్సిలర్లు, అధికారులంతా సకాలంలో హాజరవ్వాలని కోరారు.



అచ్చంపేట మండలం గ్రంథసిరిలో ప్రచారం

బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-అచ్చంపేట

మోడీని, మోడీకి మద్దతిస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం క్రోసూరు మండల కార్యదర్శి టి.హనుమంతరావు అన్నారు. అచ్చంపేట మండలంలోని గ్రంథసిరిలో శుక్రవారం ప్రచారభేరి నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానికులకు కరపత్రాలు అందించారు. సిపిఎం అచ్చంపేట మండల కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, సిహెచ్ ఏషయ్య, వి.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, ఎస్.సాంబయ్య, ఎ.చంగయ్య, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఈపూరు

ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరిని చేపట్టామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల, ఈపూరు, కొండ్రముట్ల, కొచ్చర్ల, అంగలూరు, వనికుంట, బొగ్గరం, చిట్టాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని, దేశాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ఈ విధానాలను ప్రశ్నిస్తున్న వారిని అణగదొక్కుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఊట్ల రామారావు, సూరే బ్రహ్మాయ్య, అప్పారావు, వెంకటేశ్వర్లు, మల్లికార్జునరావు, మస్తాన్, సాంబయ్య పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో ప్రచారం



డాక్టర్ సింగరాజు సాయికృష్ణకు హెల్త్ కేర్ అవార్డు

కరోనా కాలంలో అందించిన ఉచిత వైద్యసేవలకు గాను ప్రదానం

ప్రజాశక్తి-నరసరావుపేట



అవార్డును అందుకుంటున్న డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

కరోనా కష్టకాలంలో ప్రజలెవ్వరూ ఇంటి నుండి బయటకు రాలేని విపత్కర పరిస్థితుల్లో కరోనా వారియర్స్ అయిన పోలీసులు, పారిశుధ్య కార్మికులు, వైద్య సిబ్బంది, జర్నలిస్టులకు నరసరావుపేట అనన్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఉచితంగా విస్తృతమైన వైద్య సేవలు అందించారు. ఇందుకుగాను తెలంగాణా హైకోర్టు జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్, తెలంగాణా ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా నుండి హెల్త్‌కేర్ అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైద్రాబాద్ జూబ్లీహిల్స్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్‌లో మెడిక్స్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు అచీవర్స్ కంక్లేవ్ అండ్ హెల్త్ కేర్ 2023 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణా హైకోర్టు జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్, తెలంగాణా ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా, తెలంగాణా ఆర్టీసీ ఛైర్మన్ వి.సి.సజ్జనార్ పాల్గొన్నారు.

కరోనా సమయంలో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా వైద్య సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, పారిశుధ్య కార్మికులకు వారు విధులు నిర్వహించే ప్రదేశాలకు వెళ్లి ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాకుండా, వారి కుటుంబ సభ్యులకు జర్నలిస్టులకు కూడా ఉచిత వైద్య సేవలతో పాటు మందులను అనన్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అందజేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రఖ్యాత ఛానల్స్ ద్వారా ప్రజలను కరోనా పట్ల అప్రమత్తంగా ఉంచుతూ తగిన సూచనలు సలహాలు ఇచ్చి ఎంతోమందికి కరోనా పట్ల భయభ్రాంతులకు గురికాకుండా భరోసానిచ్చారు. ఈ సేవలను కొనియాడుతూ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ అనన్య హాస్పటల్స్, సింగరాజు ఫౌండేషన్ తరఫున సామాజిక బాధ్యతతో సేవలు అందించానన్నారు. సమాజానికి తనవంతు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అవార్డు అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు.



టూరిజం చైర్మన్‌కు ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-విజయపురిసౌత్ : విజయవాడలోని ఏపీ టూరిజం చైర్మన్ ఎ.శివప్రసాద్‌రెడ్డి, ఎమ్‌డి కన్నబాబును స్థానిక ఏపీ టూరిజం ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. 20 ఏళ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నామని, ఉద్యోగ భద్రత కల్పించి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు బస్‌పాస్‌ను రెన్యూవల్ చేయాలన్నారు. చైర్మన్ స్పందిస్తూ వచ్చే బోర్డు మీటింగ్‌లో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గంగరాజు, జనరల్ సెక్రటరీ పి.వీరారెడ్డి, బాబురావు, అంజల్‌రావు, నాగకుమార్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-నరసరావుపేట : జిల్లాలో జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని, అసలు పురోగతే లేని లేఔట్లను త్వరితగతిన పురోగతిలోకి తేవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. గృహ నిర్మాణంపై కలెక్టరేట్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందన హాలులో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. మండలాల వారీగా ఆయా బృందాలతో చర్చించారు. లబ్ధిదారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. లేఔట్లలో విద్యుత్ అసౌకర్యం కలగకుండా అవసరమైన చోట వెంటనే విద్యుత్తు లైన్ల ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారిని ఆదేశించారు. అవసరమైన చోట బోర్లు వేయించాలన్నారు. రానున్న 10 రోజులలో పనుల పురోగతిని 10 శాతం పెంచాలని, బిలో బేస్మెంట్ లెవెల్ నుంచి బేస్మెంట్ లెవెల్ వరకు, బేస్మెంట్ లెవెల్ నుండి స్లాబ్ లెవల్ వరకు పురోగతి సాధించేలా పనులు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణంలో జిల్లాను రాష్ట్రంలోనే ముందువరసలో ఉండేలా కృషి చేయాలని చెప్పారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు

ఉత్తమ పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్ది అందించే సత్తా ఉపాధ్యాయులకే ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మాచర్ల అధ్యక్షులు ఎక్స్‌మాస్ జాన్ అధ్యక్షతన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన సభ శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు సిఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్‌వి రామిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఉన్న సమస్యలను పట్టించుకోకుండా అధికారులు ఉపాధ్యాయులపై దాడులు చేస్తున్నారని, హెచ్‌ఎంలు తీవ్రమైన ఒత్తిడికి గురి ఆవుతున్నారని అన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. వెల్దుర్తి ఎంఇఒ ఎ.సురేష్, నాయకులు గంగాధర్‌బాబు, శిలార్, చంద్రజిత్ యాదవ్, కిషోర్, బాలునాయక్ పాల్గొన్నారు.

బిజెపి పాలనతో దేశం అధోగతి

ప్రజాశక్తి - తుళ్లూరు

బిజెపి పాలనలో దేశం అన్ని రంగాల్లో అధోగతి పాలైందని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, సిపిఐ తాడికొండ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు అన్నారు. నిరంకుశ, మతోన్మాద, అభివృద్ధి నిరోధక, వినాశనకర బిజెపిని గద్దె దించాలని పిలుపు నిచ్చారు. బిజెపికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం విప్పాలన్నారు. రాజధాని గ్రామం వెంకటపాలెం నుంచి సిపిఎం, సిపిఐ అధ్వర్యంలో శుక్రవారం ప్రచారభేరి లో ద్విచక్రవాహన ర్యాలీ మందడం, మల్కాపురం, వెలగపూడి, మోదుగ లింగాయపాలెం, ఉద్దండ రాయునిపాలెం, లింగాయపాలెం, రాయపూడి, తుళ్లూరు గ్రామాల్లో జరిగింది ఈ సందర్భంగా రవి, శివ శంకరరావు మాట్లాడుతూ 8 సార్లు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లలో అమరావతి రాజధానికి రూపాయి కూడా కేటాయించ లేదని మండిపడ్డారు. దేశ అభివృద్ధికి ఆటంకంగా మారిన మనువాద బిజెపిని ఇంటికి సాగనంపాల్సిందేనన్నారు. ధరలు తగ్గాలంటే మోడీ గద్దె దిగాల్సిందేనన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడూ లేని విధంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువులు, మందుల ధరలను బిజెపి ప్రభుత్వం విపరీతంగా పెంచేసిందని అన్నారు. మరో ప్రక్క ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కేంద్ర ప్రభుత్వం ధారాదత్తం చేస్తుందని అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీ చట్టాలను అమలు చేయకుండా, రాజధానికి, పోలవరానికి నిధులు కేటాయించకుండా ఆంధ్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్న బిజెపికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష ,జనసేన పార్టీలు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్రానికి రావలసిన హక్కుల సాధనకై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు కోరారు. మోడీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రచారభేరిలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు రాజు, ఈశ్వరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.కె ఎర్ర పేరు, మేకల నాగరాజు, నందాజీ, వెంకటేష్, కట్టెపోగు ప్రకాశరావు, పేరం బాబురావు, జె నవీన్ ప్రకాష్, కుంభా ఆంజనేయులు, షేక్ జానీ, కుంపటి వీరయ్య,పిగాంధీ, సిపిఐ నాయకులు జి సత్యానందం, నాగుల్ మీరా, కంభంపాటి దేవుని దయ పాల్గొన్నారు.



రాజధాని గ్రామం వెంకటపాలెంలో సిపిఎం, సిపిఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారభేరి


తెనాలి రూరల్ మండలం ప్రచారంలో రైతులతో మాట్లాడుతున్న సాంబిరెడ్డి


కుంచనపల్లిలో పసుపు పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్ తదితరులు

3న పసుపు రైతుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించిన రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, పసుపును రూ.10వేలు మద్దతు ధర కు కొనుగోలు చేయాలని, మే మూడో తేదీ దుగ్గిరాల పసుపు యార్డు వద్ద జరుగు పసుపు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని, కుంచనపల్లి గ్రామంలో పసుపు రైతులను కలిసి, రైతు సంఘం నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. పసుపు పంటపై రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్వవ్యాప్తంగా పసుపు పంట వేసిన రైతులు సరైన గిట్టుబాటు ధర లభించక అప్పులతో ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించిందన్నారు. డిసెంబర్లో కురిసిన అకాల వర్షాల వలన కొంత దిగుబడి తగ్గిందని అన్నారు. ఒకవైపున పండించిన పసుపుకు సరైన మద్దతు ధర లభించక పోగా, పసుపు మార్కెట్లో క్వింటా 4,800 నుండి 5200 మాత్రమే పలుకుతుందన్నారు. ఈ క్రమంలోనే తడిసిన పసుపు ను రైతుల వద్ద నుండి మరో వెయ్యి రూపాయల తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తక్షణమే పసుపు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, క్వింటా రూ.6850 కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం పసుపు రైతులకు ఉత్పాదక ఖర్చులు , కౌలు భారీగా పెరగడం వలన ఎకరాకు లక్షా 50 వేల నుండి 1,70,000 వరకు ఉత్పాదక ఖర్చులను రైతులు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలోనే పసుపు దిగుబడి 15 నుండి 20 క్వింటాలు మాత్రమే వస్తుందన్నారు. పసుపు బోర్డును, విత్తన పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. అంతేకాకుండా పసుపు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి, రైతుల వద్దనున్న నిల్వపసుపును కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, రామారావు, బిరుదు గడ్డ ప్రసాద్, తదితర రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి : పసుపుకు క్వింటాల్ కు రూ 10,000 మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూరల్ గ్రామాలైన గుడివాడ ,కొలకలూరు, నందివెలుగు గ్రామాలలో మే3 సదస్సు జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహంచారు.

పశు సంపదను కాపాడుకోవాలి

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

ప్రజాశక్తి-గుంటూరు

అంతరిస్తున్న పశు సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ పేర్కొన్నారు. దాచెపల్లిలోని వీర్ల అంకమ్మ తల్లి తిరునాళ్ళ సందర్భంగా ఏడ్లు బండ లాగు పోటీలను న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌తో కలిసి ధర్మచరణ్ ప్రారంభించారు. పవు సంపద తగ్గిపోవటం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొందరికి పశు పెంపకం ఇప్పుడు శిరోభారంగా మారిందన్నారు. పశు గ్రాసం అందుబాటులో లేకపోవటం ప్రధాన కారణమన్నారు. దీనివలన పాల పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి పశు సంపదను పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొప్పుల గిరి, ద్రోణాదుల అంకారావు, అనిశెట్టి రమేష్, కొప్పుల చినసాంబయ్య, మేడతి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న తులసి ధర్మచరణ్

వేద సీడ్స్ హైబ్రిడ్ ప్రత్తి విత్తనాలతో అధిక దిగుబడులు ..

పల్నాడు జిల్లా దుర్గి మండలానికి చెందిన గూడా శ్రీనివాసరావు అనే ప్రత్తి రైతును వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి దర్మచరణ్ సత్కరించారు. 2022 ఖరీఫ్‌లో వేద సీడ్స్ హైబ్రిడ్ ప్రత్తి విత్తనాలైన ప్లాటినం బిజీ-2 విత్తనాలను 1.60 ఎకరాలో పంటను వేసి అత్యధికంగా 27 క్వింటాల దిగుబడిని సాధించినందుకు రైతు శ్రీనివాసరావును ధర్మచరణ్ దుశ్శాలావాతో సత్కరించి అభినందించారు.

సర్పంచుల డిమాండ్లు పరిష్కరించాలి

గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు నేతాజి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో సర్పంచులు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజి ఒక ప్రకటనలో కోరారు. వారి డిమాండ్లను తమ యూనియన్ బలపరుస్తుం దన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీలకు రూ.2వేల కోట్లకుపైగా రావాల్సి ఉందని, నిధులు లేక గ్రామపంచాయతీలలో అభివద్ధి పనులు కుంటుబడ్డాయన్నారు. ఆ నిధులు పంచాయతీలకు అందేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరుతున్నారన్నారు. అలాగే పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ల పేరుతో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత ఏడాది వరకు కేంద్రం జీతాలు చెల్లించిందని, ఇప్పుడు ఆ బాధ్యత నుండి తప్పుకుందని, దీంతో వారి జీతాలు పంచాయతీలు చెల్లించగలిగే స్థితిలో లేవన్నారు.కావున రాష్ట్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని సర్పంచులు కోరుతున్నారని తెలిపారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించే నిధులు గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఖర్చు చేయాలని, మైనర్ పంచాయతీలలో త్రాగునీటి సరఫరా, వీధిలైట్ల ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని సర్పంచులు కోరుతున్న కోర్కెలు న్యాయమైనవని అన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం జరిగే కషిలో సర్పంచులకు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అండగా ఉంటుందని ప్రకటించారు.

గ్రావెల్ తవ్వకాలతో రూ.150 కోట్లు స్వాహా : ధూళిపాళ్ల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పొన్నూరు నియోజకవర్గంలో వేల కోట్ల గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. గుంటూరులోని టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఆధ్వర్యంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. ఆయనకు సిఎం కార్యాలయం నుంచి కూడా సహకారం ఉందన్నారు. శేకూరు, వీరనాయు నిపాలెం గ్రామాల్లో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతున్నారని అన్నారు. గత నాలుగేళ్లలో 500 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలు జరిపారని అన్నారు. రూ. 150కోట్ల గ్రావెల్ తవ్వుకుని ఎమ్మెల్యే రోశయ్య సొమ్ము చేసుకున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే లారీలకు మాత్రమే గ్రావెల్ తరలించే హక్కు వున్నట్లుగా ఇక్కడ కనబడుతోందన్నారు. బయటవారు ఎవరయినా వెళితే పోలీసులు మాత్రం తుపాకులు ఎక్కుపెడతారని అన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి అధికారులవరకు సాక్షాలతో సహా ఆధారాలు ఇచ్చి ఫిర్యాదు చేస్తే పట్టించుకున్న నాథుడులులేడన్నారు. టీడీపీ తరపున గ్రావెల్ మాఫియాపై అనేక పోరాటాలు చేసిన పట్టించుకోలేదంటే ముఖ్యమంత్రి ప్రమేయం ఉందని, ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది ప్రోత్సాహం ఉందని అనుమానం కలుగుతోందన్నారు. వీరనాయకుని పాలెం గ్రామంలో దళితుల భూములలో ని గ్రావెల్ ను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు.గ్రావెల్ తవ్వుకున్న వారిలో కొంత మంది ముఖ్యమంత్రి కార్యాలయం ఐడి కార్డ్స్ చూపించి ప్రజలను ,అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

పార్టీకి నవ నాయకత్వం కావాలి : చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ని గుంటూరు అర్బన్ పార్టీ అధ్యక్షులు డేగల ప్రభాకర్ శుక్రవారం జాతీయ పార్టీ కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3 రోజుల పాటు జరిగిన ఇదేం కర్మ మన రాష్ట్రనికి కార్యక్రమం దిగ్విజయం గా జరిగిన సందర్భంగా ప్రభాకర్ చంద్రబాబు ని కలిశారు. తాడికొండ నియోజకవర్గం లో జరిగిన ఇదేం కర్మ మన రాష్ట్రనికి కార్యక్రమానికి ప్రభాకర్ చేసిన కృషిని అభినందించారు.



'జగనన్నకు చెబుదాం'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రభుత్వ అధికారుల పనితీరు బాగుంటేనే ప్రభుత్వ పాలన కూడా సంతృప్తి కరస్థాయిలో సాగుతుందని, నాణ్యమైన సేవలను అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు.

వచ్చే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న "జగనన్నకు చెబుదాం" నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సీఎం జగన్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమనికి కలెక్టరేట్లోని వీసీ హాలు నుండి కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీలు రవిశంకర్ రెడ్డి, జెసి శ్యామ్ ప్రసాద్ హాజరయ్యారు.ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం విసి హాలులో హాజరైన జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విధిగా లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. వచ్చే నెల 9న రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతతో ప్రారంభించనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమం ద్వారా ఏకకాలంలోనే ప్రజల నుండి వినతిని స్వీకరించడం, అందుకు సంబంధించిన ఆమోదయోగ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించడం లేదా ఆమోదించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో సీఎంవో స్థాయి నుండి నేరుగా సచివాలయాల పరి ధిలో పర్యవేక్షించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నడిచేందుకు గాను ప్రత్యేకంగా నియ మించిన సీనియర్ లెవెల్ ఐఏఎస్ అధికారులు నెలకు రెండు పర్యాయాలు జిల్లాల్లో పర్యటించి ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ వినూత్న ప్రాజెక్టు విధానం ద్వారా నాణ్యమైన, సంతృప్తికరమైన, పారదర్శకమైన పరిష్కారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 'స్పందన' గ్రీవిన్స్ కార్యక్రమం కంటే బెటర్‌గా అర్జీల పరి ష్కారం అందుతుందన్నారు. ఇందులో 1902 కాల్స్ స్వీకరణ, ఐవిఆర్ఎస్ ఎస్.ఎం.ఎస్. సందేశంతో.. మల్టిబుల్, ఫీడ్ బ్యాక్, అప్ డేట్ సమాచారం ఎప్పటికప్పుడు హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్ నుండి అందుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభ ుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్, గ్రౌండింగ్ మొదలైన పెండింగ్ ప్రక్రియలను సంపూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా.. నిర్వహించే సచివాలయ, ఆర్బికేలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణ పనులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, ఇతర జిల్లా అధికారులు

రెండ్రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి

పట్టణంలోని హెడ్ వాటర్ వర్క్ వద్ద పాత వాల్వ్ స్థానంలో కొత్త మెయిన్ ఎంఎం డయావాల్వ్ ఏర్పాటు దృష్ట్యా ఆదివారం, సోమవారం రెండ్రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. 1 నుండి 31 వరకు అన్ని వార్డుల్లో ప్రజలు నీటి నిల్వలు ఏర్పాటు చేసుకుని పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు.



శ్మశానం ప్రహరి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పసుమర్రిలోని శ్మశానం చుట్టూ ఐదు లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణం కోసం శుక్రవారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు 34 వ వార్డు లో మంచినీటి సమస్యలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.గోవిందరావు,పట్టణ వైసిపి అధ్యక్షులు తలహా ఖాన్16 వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్ వలి,15 ఫైనాన్స్ నెంబర్ కోటనాయక్ పాల్గొన్నారు.



అంగన్వాడి కార్యకర్తలతో సమావేశం

ప్రజాశక్తి-కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడిలోని అంగన్వాడి కార్యకర్తలతో తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ ఎంపీడీవో జి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణిలకు సక్రమంగా పోషక పదార్థాలు అందించాలని, అలాగే పిల్లలకు కూడా పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. ముందుగా అంగన్వాడి కేంద్రంలో స్టాక్ రిజిష్టర్, స్టాక్ అప్డేట్స్ పరిశీలించారు. పిల్లలందరికీ బాల ఆధార్ కేంద్రాల ద్వారా ఆధార్ కార్డులు చేయించే విధంగా చూడాలని సూచించారు. పంచాయితి సెక్రటరీ కాసిన్య నాయక్, సూపర్‌వైజర్ డి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

'ఫ్రెండ్స్' ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశకి- సత్తెనపల్లి రూరల్



రక్తం సకాలంలో అందక అనేక మంది మృత్యువాత పడుతున్నారని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల అబివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ అన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ,పోలిశెట్టి ఆంజనేయులు(లేటు) ఫ్రెండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వ హిం చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకట్రావు మాట్లాడుతూ 95 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్ రావు, హెడ్ నర్స్ రమణమ్మ, డ్యూటీ డాక్టర్స్, మాబు మిత్ర బృందం పాల్గొన్నారు.

మేడికొండూరులో ఉర్దూ పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి -మేడికొండూరు

మండల కేంద్రం మేడి కొండూరులోని ఎపి స్టేట్ ఉర్దూ అకాడమీ లైబ్రరీని ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అండ్ సెక్రటరీ ఆకస్మికతనికి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాష అభివృద్ధి ,కమిటీ అభివృద్ధి గురించి కొన్ని సూచనలు చేశారు ఉర్దూ భాష అభివృద్ధి లక్ష్యం దిశగా సిబ్బంది అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తోందని చెప్పారు. స్థానికంగా ఉన్న ఉర్దూ పాఠశాలను కూడా సందర్శించి అక్కడ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న విద్యాబోధనలపై అధ్యాపకులతో మాట్లాడారు.


ఉర్దూ పాఠశాలను తనిఖీ చేస్తున్న డైరెక్టర్ ఆయుబు హుస్సేన్

కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఐకానిక్ పెస్ట్

ప్రజాశక్తి-నరసరావుపేట



విద్యార్థులలో స్నేహాభావం పెంపొం దించి విద్యార్థిని విద్యార్థుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పేందుకు 2 కె వాక్, ఐకానిక్ పెస్ట్ 2023 దోహదం చేస్తాయని కష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం 2 కె వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలశాల డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. నాతాని మాట్లాడుతూ ర్యాగింగ్ పెను భూతాన్ని తరిమికొట్టాలని, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి యువత పాటుపడాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు ధూమ మద్య పానానికి దూరంగా ఉండాలన్నారు. నాసరయ్య మాట్లాడుతూ డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి బాటలు వేయాల్సింది విద్యార్థులేనన్నారు. కళాశాల ప్రాంగణంలో ఐకానిక్ 2023 పెస్ట్ లో భాగంగా విద్యార్థులు నిర్వహించిన స్టాల్స్ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టు కున్నాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నాతాని జన్మదిన వేడుకలు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అద్యపాకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే అండతో పెట్రేగిపోతున్న డ్రగ్ మాఫియా'

ప్రజాశక్తి-నరసరావుపేట



వైసిపి అధికారం చేపట్టాక రాష్ట్రాన్ని మత్తు పదార్థాల తయారీకి,మాదక ద్రవ్యాల ఎగు మతులకు కేంద్రంగా మార్చిందని నరసరావు పేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముంబైలో పట్టుబడ్డ డ్రగ్స్ మూలాలు ముప్పాళ్ల మండలంలోని సేఫ్ ఫార్మా కంపెనీని సూచిస్తున్నాయని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కమిషన్ల కక్కుర్తి తో నరసరావపేటలో డ్రగ్ మాఫియాని పెంచి పోషించి,డ్రగ్ కల్చర్‌ను తీసుకొచ్చారని ఆరోపించారు. సేఫ్ డ్రగ్ హౌస్ ను 2019 వరకు కోడెల కుటుంబం నడిపించిందని, ఆ తర్వాత గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడు, వైసీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి సేఫ్ ఫార్మా కంపెనీని కొనుగోలు చేసి మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతున్నారని అన్నారు. ఉగ్రవాదులు వాడే ఐసీసీ డ్రగ్స్,నిషేధిత డ్రగ్స్ సేఫ్ ఫార్మా కంపెనీలో ఎమ్మెల్యే డైరెక్షన్లో శ్రీధర్‌రెడ్డి తయారు చేస్తున్నారని ఆరోపించారు. నిషేధిత డ్రగ్స్ తయారు చేసే సేఫ్ ఫార్మా కంపెనీకి ఎలా పరిమిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. ఔషధ నియంత్రణ శాఖ అవినీతి శాఖగా మారి పోయిందని విమర్శించారు. అధికారం ఉందని ఎమ్మెల్యే అండతో నరసరావుపేటలో పెట్రేగిపోతున్న డ్రగ్ మాఫియాపై కలెక్టర్,జిల్లా ఎస్పీ దృషి సారించాలని, డ్రగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక చిలకలూరిపేట పురపాలక సంఘం సాధారణ కౌన్సిల్ సమావేశం శనివారం జరుగుతుందని చైర్మన్ ఎస్.కే. రఫ్గాని శుక్రవారం నా డు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సం దర్భంగా ఈ సాధారణ సమా వేశంలో ఆరు అంశాలతో కూడిన అజెండా ఉంటుందన్నారు. కాబట్టి సమావేశానికి కౌన్సిలర్ లందరూ తప్పక హాజరు కావా లని ఆయన విజ్ఞప్తి చేశారు.

అరవిందబాబు తెలుసుకుని మాట్లాడాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నరసరావుపేట



సేఫ్ ఫార్మా కంపెనీకి సెంట్రల్ డ్రగ్ ఆఫ్ ఇండియా అన్ని అనుమతులు ఇచ్చారని సేఫ్ ఫార్మా కంపెనీ నరసరావుపేట నియోజకవర్గంలో కాదని, అది సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. చదలవాడ అరవిందబాబుకు తెలియక అనవసరంగా తనపై ఆరోపణలు చేస్తున్నారని ఇప్పటికైనా నిజనిజాలు తెలుసుకొని మాట్లాడాలంటూ చదలవాడ పై మండిపడ్డారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ముందు డాక్టర్ కోడెల శివప్రసాదరావు కుటుంబానికి చెందిన కంపెనీ, ఆ తర్వాత శనగల శ్రీధర్ రెడ్డి, తాడిపర్తి గోవిందరెడ్డి, ఎన్ఆర్ఐ లు కొనుగోలు చేశారని అన్నారు. శ్రీధర్‌రెడ్డికి వైసిపికి,తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.శ్రీధర్ రెడ్డి తెలంగాణకు చెందినవాడని వాటాదారులు అమెరికాలో ఉన్నారని తెలిపారు. పేకాట ఆడేవాళ్ళు , మహిళలను మోసం చేసే వాళ్లు చదలవాడ వెనకే ఉన్నారని విమర్శించారు. ఆరోగ్యశ్రీని అడ్డంపెట్టుకుని రూ 16 కోట్ల 33లక్షల రూపాయలు బిల్లులు డ్రా చేశారని ఆయనపై విమర్శలు చేశారు. కట్టమూరిలో ఉన్న అశోక్ అనే 26 సంవత్సరాల అతనికి ఆపరేషన్ చేసి రూ 1.50 లక్షలు తీసుకొని ఆరోగ్యశ్రీ రాదని చెప్పి రూ 60 వేలు డ్రా చేసిన ఆధారాలు ఉన్నాయన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు ఎర్రగుంట్ల చెన్నయ్యకు నరసరావుపేట నియోజకవర్గ టిడిపి భాద్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ట్రై సైకిల్ ను అందజేశారు. ఇటీవల డాక్టర్ చదలవాడ నల్లగార్లపాడు గ్రామంలో పర్యటించినప్పుడు చెన్నయ్య తనకు ట్రై సైకిల్ కావాలని కోరగా ఆయన స్పందించి చెన్నయ్యకు ట్రై సైకిల్ అందజేశారు.



సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని 37 వ వార్డు లో సిసి రోడ్డు నిర్మాణానికి చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం శుక్రవారం శంకుస్థాపన చేశారు. రజక చెరువు నుంచి తెనాలి చికెన్స్ వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టి నట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్ ఎం.శశిరేఖ-దేవి, 34వ వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, రామ్ నరేష్ యాదవ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ సెక్రెటరీగా దయాకర్

ప్రజాశక్తి-మంగళగిరి



నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ సెక్రెటరీగా గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బందెల దయాకర్ నియమితు లయ్యారు. ఈ మేరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్, యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఫౌండర్, నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్ .జోతీశ్వర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేషనల్ హ్యూ మన్ రైట్స్ స్టేట్ సెక్రెటరీగా దయాకర్ ఏడాది పాటు పదవీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మంగళగిరి నియోజకవర్గ మహాన్యూస్ ఛానల్ రిపోర్టర్‌గా, మంగళగిరి ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న దయాకర్ ఇటీవల ఉత్తమ జర్నలిస్ట్ గా ఉగాది పురస్కారం అందుకుని తాజాగా నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ సెక్రెటరీగా నియమితులు కావడం విశేషం.



కళాకారుడు సత్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో శుక్రువారం ఎన్టీఆర్ నటించిన యమగోల చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఇందులో భాగంగా రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో ప్రముఖ పౌరాణిక, సాంఘిక, రేడియో, టివి కళాకారుడు వెంపటి సత్యనారాయణను తెలుగుదేశం నాయకులు ఈదర వెంకట పూర్ణచంద్, ఆవుల చక్రవర్తి, కాకుమాను సత్యం, పోపూరి రామ్మోహనరావు, కొరటాల జ్ఞానేంద్ర ప్రసాద్, కనగాల వెంకటేశ్వరరావు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు దేవరపల్లి భవాని, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, ముళ్లపూడి వెంకట్, శాఖమూరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేక అంబటి విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మంత్రి అంబటి రాంబాబు కళ్లున్న కబోది అని టిడిపి జిల్లా నాయకులు మన్నెం శివనాగ మల్లేశ్వరరావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి, సత్తెనపల్లి, మేడికొండూరులో చంద్రబాబు నాయుడు సభలకు భారీగా ప్రజలు వచ్చారని అయినా మంత్రి అంబటి రాంబాబు జనం రాలేదని అంబటి అసత్యాలు పలుకుతున్నారని అన్నారు. చంద్రబాబు సభలకు వచ్చిన జనాన్ని చూసి కంగారు పడుతూనే పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. చంద్రబాబు సభకు వచ్చిన ప్రజలను చూసి తట్టుకోలేక అంబటి ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని అన్నారు. సత్తెనపల్లిలో టిడిపి అభ్యర్థిగా పోటీకి నిలవాలని కోరిక ఉందని అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్న కట్టుబడి ఉంటానని తెలిపారు.

సమస్యలు రాసిస్తే అభివృద్ధి పనులు చేస్తాం

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఎంపిటిసి సభ్యులందరూ తమ తమ ప్రాంతంలోని సమస్యలు రాత పూర్వకంగా ఇచ్చినట్లయితే పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడతామని ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి అని అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సభ్యులు తమ ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు రాతపూర్వకంగా ఆమెకు అందజేశారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను తెలిపారు జలవనరుల శాఖ ఏఈ ఇ వనిత మాట్లాడుతూ ఏప్రిల్ 18వ తేదీన డెల్టాకు నీటి సరఫరా నిలిపివేశామని కాలువల మరమ్మతుల నిమిత్తం చేపట్టవలసిన పనులకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ ఎస్ కే యం షా మాట్లాడుతూ మే 15వ తేదీ నాటికి మండల వ్యాప్తంగా 500 గృహాలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికి 435 గృహాల నిర్మాణం పూర్తయిందని మరో 65 ఇళ్లు నిర్మించాల్సి ఉందని వివరించారు. తుమ్మపూడిలో లైన్‌మెన్ లేదని మండల కో-ఆప్షన్ సభ్యులు అడగగా ఆ పోస్ట్ మంజూరు అయిందని, రావాల్సి ఉందని ఏఈ సత్యనారాయణ తెలిపారు. మండల విద్యా శాఖధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలో ఇచ్చిన బ్యాగులు చినిగిపోయాయని, మరో రెండు వేల బ్యాగులు రానున్నట్లు చెప్పారు. ఈమని పిహెచ్‌సి డాక్టర్ ఇన్నరావు మాట్లాడుతూ గతంలో మొదటి కాన్పుకు తల్లికి రూ.5,000 ఇచ్చేవారని, ఇకముందు రెండో కాన్పు లో ఆడపిల్ల పుట్టినట్లయితే రూ.5,000 ప్రభుత్వం ఇస్తుందన్నారు. పెదపాలెం సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పథకం వారు ప్రారంభించిన మొక్కల పెంపకానికి సంబంధించి పనిచేస్తున్న వ్యక్తికి గత తొమ్మిది నెలల నుంచి జీతం రాలేదని తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి మేకతోటి అరుణ ఎంపిడిఒ కె.శ్రీదేవి, సూపరింటెండెంట్ డి.వీరయ్య, తహశీల్దార్ కె.మల్లేశ్వరి, మండల ఉపాధ్యక్షులు పి.సాయి చైతన్య షేక్ షబానా పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో ఎంపిపికి వినతిపత్రం అందజేస్తున్న మండల ఉపాధ్యక్షులు సాయి చైతన్య

భావితరాల కోసం ఇంధన పొదుపు

ప్రజాశక్తి-దుగ్గిరాల

భావి తరాల కోసం ఇంధనం పొదుపు ఎంతో అవసరమని స్థానిక ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత శ్రీనివాస్ అన్నారు .స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్, బాలికల హైస్కూల్, ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ వారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంధనం పొదుపు, ఇంధన వనరుల నుండి ఉత్పత్తి అయ్యే ఉద్గారాల నివారణ కోసం పెట్రోలియం కన్సర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సంవత్సరం 15 రోజులపాటు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇంధనం పొదుపు తోపాటు ఉద్గారాల నివారణ కోసం చేపట్టాల్సిన జాగ్రత్తలను ఈ అవగాహన సదస్సులో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



ఇంధన పొదుపు కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

'బ్రతుకుదాం.. బ్రతుకునిద్దాం'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎయిడ్స్ బారిన పడ్డ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించే ప్రక్రియను పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు శుక్రవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి సుశృత హాలులో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'బ్రతుకుదాం.. బ్రతుకునిద్దాం' ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ట్రస్ట్ వ్యవ స్థాపకులు జ్ఞాన ప్రసన్న గిరి అధ్యక్షత వహించారు. ప్రమాదకర వ్యాధి బారిన పడిన చిన్నారులకు సరైన పోషకాహారం లేకపోవడం వల్ల అనేక మంది మతి చెందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారి కోసం మంచి కార్యక్రమాన్ని మొదలుపెట్టిన అమ్మ ట్రస్ట్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పౌష్టికాహారాన్ని అందించే దాతలను లబ్ధిదారులతో అనుసంధానం చేయడం గొప్ప విషయమన్నారు. దీని వల్ల పిల్లలు నేరుగా సహాయం పొందుతారని గుర్తు చేశారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ బాధిత చిన్నారులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జ్ఞాన ప్రసన్న పిల్లలకు మధ్య వారు ఏర్పరిచిన సంబంధం అభినందనీయమని ఆమె అన్నారు. నెలకు సరిపడ పౌష్టికాహారం చిన్నారులకు అందించడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. జ్ఞాన ప్రసన్న గిరి బాబా మాట్లాడుతూ ఎంతో మంది హెచ్ఐవి సోకిన చిన్న పిల్లలు పౌష్ఠిక ఆహారం లేకపోవడంతో చనిపోతున్నారని అన్నారు.ఎంత ఖరీదైన మందులు ప్రభుత్వం అందిస్తున్న వాళ్ళకి సరైన పౌష్టికాహారం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 126 మంది బాధిత పిల్లలు నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరికి రూ.1000 విలువ చేసే పౌష్టికాహార సరుకులను దాతల సహాయంతో ప్రతి నెలలో రెండో శనివారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్‌టి కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర రావు, రెహమాన్, పాల్గొన్నారు.



'బ్రతుకుదాం.. బ్రతుకునిద్దాం'ను ప్రారంభిస్తున్న పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు

నేడు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ హాల్లో జరుగుతుందని చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం శుక్రవారం తెలిపారు . సమావేశంలో అజెండా అంశాలపై చర్చ జరుగుతుందని, సభ్యులు విధిగా సమా వేశానికి హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సి పరిధిలోని కుంచనపల్లి, గుండె మెడ, కొలనుకొండ గ్రామాల్లో అత్యవసర విద్యుత్తు లైన్లు మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు మంగళగిరి విద్యుత్ శాఖ ఏఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయాన్ని గ్రామీణ ప్రజలు గమనించి, విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.



పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక మార్కెట్ సెంటర్ లోని మునిసిపల్ బిల్డింగ్ దిగువ హర్షిత మెడికల్స్ వద్ద పాత్రికేయులు, రాష్ట్ర వార్త సంపాదకులు కంకిపాడు రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు ప్రారంభించారు.పట్టణ ఆర్యవైశ్య సంఘం, దాని అనుబంధ సంఘాలు సంయుక్తంగా పట్టణంలో వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు, టి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ప్రజల సహకారంతో అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదురు నూతన చలివేంద్రాన్ని అర్బన్ సీఐ ఎం.బాబి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల వేసవి తాపాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అర్బన్ పోలీస్ సిబ్బంది, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వృద్ధులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక 'మనఇల్లు' వద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కాకరపర్తి సుబ్రమణ్యం మాట్లాడుతూ క్లబ్ సభ్యులు ఎం.వెంకటలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. సభ్యుల కుటుంబాలలో శుభకార్యాలను పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు సిహెచ్ మురళి, క్లబ్ సభ్యులు వెచ్చ సాంబశివరావు నంబూరు శ్రీ కుమార్, జె శ్రీనివాసరావు, భారత లక్ష్మి, రూప్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పూర్ణచంద్రరావు

టూరిజం, ట్రావెల్ మేనేజ్మెంట్‌లో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచీకరణ నేపథ్యంలో టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ కోర్సుల్లో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ కోర్సుల విభాగాధిపతి ప్రొఫెసర్ పి.పూర్ణచంద్రరావు చెప్పారు. స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో రెండ్రోజుల శిక్షణలో భాగంగా శుక్రవారం కార్యక్రమానికి ప్రొఫెసర్ పూర్ణచందర్రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో వేగంగా అభివద్ధి చెందుతున్న రంగాల్లో టూరిజం అండ్ ట్రావెలింగ్ మూడవ స్థానం ఆక్రమించి, ఆయా దేశాల ఆర్థిక అభివద్ధిలో కీలక పాత్ర పోషిస్తుని తెలిపారు. తరచూ విహారయాత్రలు చేయడం ద్వారా విజ్ఞానం, వినోదంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. టూరిజం ద్వారా ప్రజలకు ఆయా ప్రాంతాల చరిత్ర, భాషలు, సంస్కృతులు, నాగరికత, ఆచార వ్యవహారాల గురించి పూర్తిగా తెలుసుకునే అవకాశాలు మెరుగవుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ మహిళా కళాశాల ద్వారా సాధారణ కోర్సులతోపాటు వృత్తి విద్యా కోర్సుల ద్వారా ప్రతి సంవత్సరం వందలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హిస్టరీ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.అనురాధ, అధ్యాపకులు ఎం.భాస్కరరావు, హిస్టరీ రఫీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

సిసిఆర్‌సి కార్డుల జారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పంటకాల్వ, డ్రెయినేజీ పనులను ఆయకట్టు రైతులకే అప్పగించండి
- గుంటూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

జిల్లాలో కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు మంజూరయ్యేలా రెవెన్యూ అధికారులు, వ్యవసాయాధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సలహామండలి జిల్లా అధ్యక్షులు నల్లపాటి శివరామకష్ణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ అధికారులు భూ యజమానులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, సిసిఆర్‌సి కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని, దీని కోసం జిల్లా స్థాయి అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పంట కాల్వలు, డ్రెయిన్ల పూడికతీత, నిర్వహణ పనులు వీలైనంత వరకూ అయకట్టు రైతు సంఘాలకు అప్పగించాలని సూచించారు. మే మొదటి వారానికి పంట కాల్వలు, డ్రెయినేజీ కాల్వల్లో అపరేషన్లు, నిర్వహణ పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. రానున్న ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఆర్బీకేలలో అందుబాటులో ఉంచాలని, పచ్చిరొట్టె విత్తనాలను అవసరం మేరకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైఎస్ఆర్ యంత్రసేవా పథకం ద్వారా సీహెచ్సీలు, క్లస్టర్ సీహెచ్‌సిలకు మే 30 నాటికి యంత్రాలను గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శివరామకృష్ణ మాట్లాడుతూ ఇరిగేషన్ కెనాల్స్ అపరేషన్స్, నిర్వహణ పనులు స్థానిక రైతు సంఘాలకు అప్పగించటం ద్వారా సకాలంలో పనులు పూర్తి అవుతాయని అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారి సుజాత, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, మార్క్ఫెడ్ డీఎం కృష్ణారావు, ఏపీ సీడ్స్ డీఎం సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్, ఐటిఐ విద్యార్థులకు జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్, ఐటిఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఈనెల 29న నల్లపాడులోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఫర్ మైనార్టీస్‌లో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చర్ డ్రోన్ పైలెట్ పోస్టుకు గ్రామ్ తరంగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా జరుగుతుందని, 27 ఏళ్లలోపున్న వారే అర్హులని పేర్కొన్నారు. డిప్లొమ, ఐటిఐలలో అన్ని బ్రాంచిలు/ట్రేడ్‌ల విద్యార్థులు హాజరవ్వొచ్చని తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందని, ఎంపికైన వారికి రూ.15వేలు కనీస స్టైఫండ్ అందుతుందని, ఎంపికైన వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయాలు ఉంటాయని వివరించారు. వివరాల కోసం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి బి.బాలాజీ ఫోన్ 9110335351కు సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో గురువయ్య కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్ ఫలితాల్లో స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య కాలేజి కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధించినట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు పేర్కొన్నారు.జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సెక్రెటరీ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ విద్యార్థి షేక్ సల్మాన్ 90 శాతం మార్కులతో ఎంపీసీ గ్రూపులో మొదటి స్థానం, ఎంఇసిలో బి.గోవిందసాయి 99శాతం మార్కులు సాధించారన్నారు. అలాగే సిఇసిలో లుక్ఒబెర్సన్ 95శాతం మార్కులు సాధించాడని చెప్పారు. పి అభిలాష్ , ఏ నిరంజన్ రెడ్డి మెరుగైన ఉత్తమ ఫలితాలు సాధించారని తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్

కాలుష్య నియంత్రణలో హైడ్రోజన్ కీలకం

ప్రజాశక్తి-గుంటూరు




మాట్లాతున్న గోవర్ధనరావు, తదితరులు

వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు హైడ్రోజన్ ఎంతగానో దోహదపడుతుందని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్-అమరావతి రీజియన్ సెంటర్ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు 'హైడ్రోజన్ - కెన్ ఇట్ బి ఏ సేవియర్ అఫ్ ది ఎర్త్ ఫ్రం గ్లోబల్ వార్మింగ్' అంశంపై జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రొఫెసర్ గణపతి యాదవ్ ఆన్‌లైన్ ద్వారా పాల్గొని హైడ్రోజన్ ప్రాధాన్యంపై మాట్లాడారు. వాతావరణంలో కాలుష్య నివారణకు హైడ్రోజన్ దోహదపడే తీరును వివరించారు. 2070 నాటికి భారతదేశం కాలుష్య రహిత వాతావరణ సమాజం ఏర్పాటులో హైడ్రోజన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని చెప్పారు. హైడ్రోజన్ వాతావరణంలో ఎక్కువ శాతం అంతర్లీనం అయివుందని, దానిని సేకరించి ఉపయోగించుకోవడం ద్వారా ఉష్ణోగ్రతలో మార్పులను సమతుల్యం చేయొచ్చన్నారు. దీంతోపాటు వాహనాలకు, ఫ్యాక్టరీలకు, థర్మల్ పవర్ ప్లాంట్‌లకు వాడే పెట్రోల్, డీజిల్, బొగ్గు, వంటి వాటికి బదులు హైడ్రోజన్ వల్ల ఉత్పత్తి అయ్యే ఇంధన శక్తిని వాడటం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చని వివరించారు. అమరావతి రీజియన్ సెంటర్ చైర్మన్ డాక్టర్ వి.గోవర్ధన్‌రావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ కిరోసిన్ ఇంధన శక్తి కంటే హైడ్రోజన్ శక్తి మూడురెట్లు ఎక్కువ సామర్థ్యం కలిగి ఉందన్నారు. ప్రకృతి విపత్తులు వాతావరణ మార్పులపై ఆధారపడి ఉంటాయని, వాటిని అధిగమించే దిశగా విద్యార్థులు పరిశోధనలు చేయాలని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ సూచించారు. కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళిమోహన్, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ ప్రసంగించారు. ఆర్అండ్‌డి డైరెక్టర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డు మెంబర్ డాక్టర్ ఎస్ఎస్‌వి రామ్‌కుమార్ ఆన్‌లైన్ ద్వారా సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సి.వి.వి.సత్యన్నారాయణ , డాక్టర్ జి.రంగారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై వేస్తే చర్యలు

అపరాధ రుసుం వసూలు చేయాలని సిబ్బందికి కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్


రోడ్ల మీద ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను మూడ్రోజుల్లో తొలగించాలని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రోడ్లపై మీద భవన నిర్మాణ వ్యర్థాలను వేసిన వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్మాణదారులు ఇష్టానుసారం రోడ్ల మీద వేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి వారి నుండి అపరాధ రుసుం వసూలు చేసి, వ్యర్థాలను తొలగించాలని సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. భవన నిర్మాణ సమయంలో తప్పనిసరిగా గ్రీన్ మ్యాట్‌తో దుమ్ము రాకుండా కవర్ చేసుకోవాలని యజమానులకు తెలియజేయాలన్నారు. ఇప్పటివరకు రీసర్వే 76 శాతం జరిగిందని, వచ్చే వారానికి 85 శాతం పూర్తి చేయాలన్నారు. మీడియా డివైజ్ ఫీజుల బకాయిలు, ప్రస్తుతం ఫీజులు వసూళ్ల, టిటిడిఆర్ బాండ్లు జారీ, కోర్టు కేసులపై సమీక్షించారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఎసిపిలు బాబురావు, అజయ్‌కుమార్, అశోక్‌కుమార్, సర్వేయర్లు సునీల్‌కుమార్, హరికృష్ణ, టిపిఎస్‌లు పాల్గొన్నారు.